క్లుప్తంగా

వెలుగుపల్లె.. బురదమయం



బురదమయంగా మారిన రహదారి

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయమైంది. దీంతో అపరిశుభ్రత పేరుకుపోయి రహదారి వెంబడి నడవాలంటే దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థులు ఆ రహదారి వెంట నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రజలకు అంటువ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా బ్లీచింగ్ పౌడర్ చల్లి, అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి పేర్కొన్నారు. రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్, టీబీ, మాదకద్రవ్యాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం వలన ఎక్కువ మంది హెచ్ఐవీ రక్తపరీక్షలు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎన్ఏసీఓ నేతృత్వంలో 2 నెలల పాటు మీకు తెలుసా రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఓఆర్‌డబ్ల్యూ అలేఖ్య, పీర్ ఎడ్యుకేటర్ వరలక్ష్మీ, ఖాదర్‌వలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

పెనగలూరు : గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. సోమవారం పలు గ్రామాల నుంచి భూ సమస్యలు తహసీల్దార్‌కు అందజేశారు. ఓదేటివారిపల్లికి చెందిన శివయ్య అనే రైతు తన భూ సమస్యపై ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు వీఆర్‌ఓను అక్కడికి పిలిపించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వీఆర్‌ఓ తమతమ పంచాయతీల పరిధిలో వచ్చిన గ్రీవెన్స్ అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



చిట్వేలి : చిట్వేలి – రాపూరు ప్రధాన రహదారి తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ దత్త నారాయణ తపోవన ఆశ్రమానికి సోమవారం మానవత సేవా సంస్థ సలహా బోర్డు సభ్యులు, మాజీ సర్పంచ్ మద్దిన చంద్రమోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర సరుకులను వితరణ చేశారు. దాత చంద్రమోహన్‌ను మానవత సభ్యులు కేక్ కట్ చేసి మెమెంటోతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మునిరావు, సాయిరాం, కో–చైర్మన్ గుత్తి నరసింహులు, శ్రీనివాసులు, సభ్యులు బాలాజీ, శివరాజు, చింటూ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శ్రీ మాతాంగి మహాపీఠం లక్కిరెడ్డిపల్లె వాసులకు వరం



మహానందగిరి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : శ్రీ మాతాంగి మహాపీఠం ఈ ప్రాంత వాసులకు వరంలాంటిదని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాయచోటి – వేంపల్లి మార్గంలోని దొరిచెరువు వద్ద వెలసిన శ్రీ మాతాంగి మహా పీఠాన్ని ఎంపీపీతోపాటు సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, కాలాడి జనార్దన్ రెడ్డి తదితరులు సందర్శించి మహానందగిరి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహానందగిరి స్వామి వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. శ్రీ మాతాంగి మహాపీఠం ఆలయం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ మాతాంగి మహాపీటం నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని మహానందగిరి స్వామికి నాయకులు తెలియజేశారు.

పింఛన్లు పునరుద్ధరించండి

వీరబల్లి : మట్లి పంచాయతీలో ఇటీవల సర్వేలో 47 మంది దివ్యాంగుల పింఛన్లు అధికారులు తొలగించారని ఆ గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తొలగించిన వారిలో పది మందికి రూ.4వేలు మార్పుచేసి పింఛన్ ఇస్తున్నారన్నారు. మిగిలిన వారు కూడా అర్హత ఉన్న అనర్హులుగా చేసి వారి పొట్టకొట్టారని, ఇది మంచిది కాదని ఫిర్యాదు చేశారు. తొలగించిన వారికి తిరిగి పరీక్షించి దివ్యాంగుల పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ కలెక్టర్‌ను కోరారు.

ఉద్యాన పంటలే ఊపిరిగా..

- గంపెడాశలతో అరటి, బొప్పాయి సాగు
- తెగుళ్లను అధికమిస్తే మంచి దిగుబడి
- గతేడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు
- దళారీల బెడద తప్పించాలంటూ రైతుల డిమాండ్

అరటి, బొప్పాయి సాగు ఎకరాలలో..

మండలం	అరటి	బొప్పాయి
కోడూరు	2420	13000
ఓబులవారిపల్లి	1830	2462
పుల్లంపేట	2200	650
చిట్వేలి	838	1890
పెనగలూరు	295	315



నియోజకవర్గంలో రైతులు సాగు చేస్తున్న అరటి పంట



రైల్వేకోడూరులో బొప్పాయి సాగుకు సిద్ధం చేసిన పొలం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉద్యానం అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. రైతులు అరటి, బొప్పాయి పంటలను గంపెడు ఆశలతో ప్రతి ఏడాది సాగు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. కాగా గత మూడు సంవత్సరాలుగా అరటి, బొప్పాయి పంటలను వాతావరణ మార్పులు, ధరల తగ్గుదల రైతుల వెన్ను విరిచాయి. అయినా ప్రతి ఏడాది ఈ పంటలనే ఇక్కడి రైతులు సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది అయినా కాస్తయినా లాభాలు చూస్తామనే ఆలోచనతో వేలాది ఎకరాల్లో అరటి, బొప్పాయిని సాగు చేస్తున్నారు. అరటిలో టిష్యూ కల్చర్, బొప్పాయిలో తైవాన్ మొలకలు సాగుచేయడానికి రైతులు ఎక్కువగా మక్కువ చూపిస్తుంటారు. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో అరటి, బొప్పాయి పంటను రైతులు సాగు చేస్తున్నారు.

కోడూరులో టిష్యూ కల్చర్ అరటి, బొప్పాయి పిలకల నర్సరీలు ఉన్నాయి. అన్ని గ్రామాల రైతులు ఇక్కడ నుంచే ఎక్కువ భాగం కొనుగోలు చేసి నాటుకుంటున్నారు.

నాణ్యమైన దిగుబడికి, మొక్కల ఎంపిక, తెగుళ్ల నివారణ ముఖ్యం

ఈ ప్రాంత రైతులకు ప్రతి యేడాది అరటి, బొప్పాయి పంటలకు రైతులకు మొక్కల ఎంపికలో విఫలం కావడం, పంట యాజమాన్యం సరిగా లేకపోవడంతో పంటకు సోకిన తెగుళ్ల రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది రైతును బొప్పాయి పంట రైతులను నిరుత్సాహానికి గురి చేస్తూవుంది, నులి పురుగు, వేరుకుళ్లు, ఆకుముడత, బూజు పురుగు తెగుళ్లు పంటను నాశనం చేస్తున్నాయి. వీటిని అధిగమిస్తే బొప్పాయి పంట వల్ల రైతుకు మూడు దశల్లో ఆదాయం ఉంటుంది. బొప్పాయి పంట చేతికివచ్చే దశలో తెగుళ్ల నుంచి కాపాడుకోగలిగి, మంచి ధరలు పలికితే రైతులకు ఎకరాకు లక్షపైనే ఆదాయం వస్తుంది.

దిగుబడి వచ్చినా.. మార్కెటింగ్, దళారీలతో..

కోడూరు ప్రాంతంలో అరటి, బొప్పాయి పంటలను బాగా పండించినా రైతులకు సొంతంగా మార్కెటింగ్ చేసుకొనే వసతులు లేకపోవడం, ఎక్కువ శాతం రైతులకు సొంతంగా పెట్టుబడి పెట్టే స్తోమత లేకపోవడంతో రైతులు స్థానిక వ్యాపారులనే ఆశ్రయిస్తుంటారు. ప్రతి ఏడాది ఇక్కడి నుంచి వ్యాపారం వందల కోట్లలో ప్రతి ఏడాది జరుగుతుంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడ మకాం పెట్టి స్థానిక దళారులతో వ్యాపారాలు సాగిస్తుంటారు. ఇదే అదునుగుగా రైతులకు, వ్యాపారులకు మధ్య దళారులు చేరి వ్యాపారులు ఒక రేటు, రైతులకు ఒకరేటు, లోడ్ తూకాలలో కోత, కమీషన్, పెట్టుబడి కోసం రైతులకు అధిక వడ్డీలకు డబ్బులిచ్చి రాబట్టడం ఇలా రకరకాలుగా రైతులను మోసం చేస్తూ సంపాదిస్తుంటారు. ఇక్కడ కొందరు దళారీ, వ్యాపారులు పంట ధరలను శాసిస్తుంటారు.

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి



గత 10 సంవత్సరాలుగా బొప్పాయి, అరటి పంటలనే సాగు చేస్తున్నాను. అయితే ఈ ఏడాది లాగా నష్టాలు ఎప్పుడూ లేవు. ప్రస్తుతం నేను 5 ఎకరాలలో బొప్పాయి, 5 ఎకరాలలో అరటిని వేశాను. ఇప్పటికే ఖర్చు రూ.4 లక్షలు దాటింది. కానీ ప్రస్తుత ధరల ప్రకారం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి కనిపిస్తోంది. సాగు వదులుకోలేక నష్టాలు తట్టుకోలేక పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటోంది.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి, రైల్వేకోడూరు మండలం

అప్పులు చేసి పెట్టుబడి



బొప్పాయికి పెట్టుబడి అధికంగా ఉంటుంది. దుక్కులు, ఎరువు, పిలకలు, కూలీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అయినా లాభాలు వస్తాయన్న నమ్మకం లేదు. ధరలు ఉండి పంట బాగా వచ్చినా దళారీలు ధరలు పెట్టరు. సమయానికి పంటను విక్రయించకపోతే కాయలు దెబ్బతింటాయి. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు మార్కెటింగ్ సదుపాయంతోపాటు ధరలపై దృష్టి సారించాలి.

– నారాయణరెడ్డి, బొప్పాయి రైతు, పుల్లంపేట మండలం

సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులు బొప్పాయి మొక్కలు నాటే సమయంలో సస్యరక్షణలు పాటించాలి. 1.5 అడుగుల గుంతలో కొంత పశువుల ఎరువు, సూపర్ పాస్పేట్ 50 గ్రాములు, కార్బోసిరాన్ గ్రాన్యుల్ 5 గ్రాములు వేసి నీరు పెట్టాలి. తరువాత మొక్కలు నాటాలి, తెల్లదోమ, రసం పీల్చు పురుగుల నుంచి కాపాడుకోవడానికి అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలి.

– వెంకట భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, కోడూరు మండలం

సహాయక చర్యలకు నిరంతరం అందుబాటులో..

సిద్దవటం : మండలంలోని పెన్నానది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటి ప్రవాహం పెరుగుతోదన్నారు. మండలంలోని జ్యోతి గొల్లపల్లి, వంతాటిపల్లె, ఆకులవీధి, గాండ్లపాలెంతోపాటు మరికొన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరంతరం సహాయక చర్యలకు తాము అందుబాటులో ఉంటామని ఏదైనా జరిగితే వీఆర్‌ఓలకు, వీఆర్ఏలకు తెలపాలన్నారు. ఏదైనా విపత్తు సంభవిస్తే సమాచారానికి 97048 98945, 80742 29387, 76749 50729లకు సమాచారం తెలపాలని తహసీల్దారు తెలియజేశారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్చాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌టీయూ నాయకులు

రాయచోటి టౌన్ : బడి బయటి పిల్లలు బడిలో చేర్చాలని ఆ దిశగా అందరూ పని చేయాలని జిల్లా ఉప విద్యాశాధికారి ఎల్. నాగయ్య ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన డీవైఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజుతో పాటు మరికొంత మంది కలసి ఆయన్ను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ సభ్యులు వేణుమాధవరాజు, కొండూరు మురళీ మోహన్ రాజు, వెంకటసుబ్బయ్య, హరిప్రసాద్, జగదీశ్వరయ్య, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షులు వంగిమళ్ల రంగారెడ్డి డీఆర్‌ఓ, డీసీహెచ్ అధికారి ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకులు ముప్పాల వెంకటరామరాజు, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి.రెడ్డి శేఖర్‌రెడ్డిలతో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దివ్యాంగులకు పింఛన్ పెంచారన్నారు. అదే సమయంలో గత కొంతకాలంగా అనర్హులు ఉన్నారనే నిరాధరమైన ఆరోపణలతో అందరి సదరం సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య నిపుణవులు ఒక ఫైల్ మరొక్కరికి ఇవ్వడం, నీవు దివ్యాంగుడివి కాదని చెప్పడం, ఇచ్చిన పర్సంటేజ్ తగ్గించడం వంటివి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి తప్పిదాలతో అర్హత కలిగిన వారు చాలా ఇబ్బంది పడుతున్నారని దీనిపై సమగ్ర విచారణ సాగించి అర్హత కలిగిన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు మల్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సుండుపల్లె - రాయచోటి రోడ్డు పనులు పూర్తి చేయించండి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

సుండుపల్లె : మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి వెళ్లేందుకు రెండు లైన్ల రహదారి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, మండల నాయకులు కలిసి సోమవారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండల ప్రజలు, విద్యార్థులు ప్రతిరోజు బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో ప్రయాణిస్తుంటారని అన్నారు. సరైన రోడ్డు మార్గం లేక అవస్థలు పడుతూ వ్యయప్రయాసాలకు ఓర్చుకుంటూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నారని తెలిపారు. రోడ్డు గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని మరికొందరూ దివ్యాంగులుగా మారారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సుండుపల్లె పట్టణ ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి మురుగునీరు నిలిచిపోయి వాహనదారులకు, కాలినడక సాగించే ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఇటువంటి సమస్యలపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చల్లంగా చూడు గంగమ్మ తల్లి



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ప్రసాద్ బాబు

రాయచోటి టౌన్ : చల్లంగా చూడు గంగమ్మ తల్లి అంటూ టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు పొలిమేర గంగమ్మకు పూజలు చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డు మార్గంలో ఆయన తండ్రి స్వర్గీయ మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు నిర్మించిన నూతన ఆలయంలో శ్రీ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట : కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ సామాజిక సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఒంటిమిట్ట మండల పోలుబుచ్చయ్యగారిపల్లెకు చెందిన కువైట్ రెడ్డీస్ సేవా సంఘం సభ్యుడైన నల్లగొండు గంగిరెడ్డి కువైట్‌లో అనారోగ్యంతో మృతిచెందిన తరుణంలో మృతుని కుటుంబసభ్యులకు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కువైట్ రెడ్డీస్ సంఘం అధ్యక్షుడు నాయని మహేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు మన్నూరు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు వీపీ రామచంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు అరవ సుబ్బారెడ్డిలు సేవాపరమైన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఎడారి దేశమైన కువైట్‌కు జీవనోపాధి కోసం వెళ్లి అక్కడ నానాకష్టాలు పడుతున్న వారు ఉన్నారన్నారు.

అలాగే వివిధ కారణాలతో మృతి చెందిన వారు కూడా ఉన్నారు. అలాంటి వారి కోసం రెడ్డీస్ సేవా సంఘం తామున్నానమని సేవ చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. టి.సుండుపల్లె మండలానికి చెందిన నాలుగు నెలల పసిపాప షేక్ బాదిబా హెర్నియా సమస్యతో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోతున్న క్రమంలో వారికి రెడ్డీస్ సేవా సంఘం తరపున రూ.30 వేలు అందజేయడం హర్షణీయమన్నారు. సమాజ సేవకు కోసం తాము సంపాదించిన మొత్తంలో కొంత సాయం చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనరు ఇలియాస్ మాట్లాడుతూ రెడ్డీస్ సేవా సంఘం సభ్యులు చేస్తున్న సామాజిక సేవలతో అనేక మంది కువైట్‌లో ఉన్న వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న బాధితులను ఆదుకుంటున్నారన్నారు. ఎవరైన ఇండియాకు వెళ్లలేకపోతే రెడ్డీస్ అసోసియేషన్ సభ్యులు ముందుకొచ్చి వారికి టికెట్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. రెడ్డీస్ సేవా సంఘంలో 90 శాతం వైఎస్సార్ కుటుంబ అభిమానులేనన్నారు. అందులో మహేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ కువైట్ కార్యవర్గంలో ముఖ్యులుగా ఉండటం సంతోషకరమన్నారు. రెడ్డీస్ సేవా సంఘం అధ్యక్షుడు నాయని మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డీస్ సేవాసంఘం సభ్యులుగా ఉన్న వారు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు రూ.1లక్ష, కమిటీలో లేని వారికి రూ.50 వేలు ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి సమస్యలలో ఉన్న వారికి కుల, మతాలకు అతీతంగా వారి పరిస్థితిని బట్టి రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఆర్థికసాయం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు యర్రంరెడ్డి రవి చంద్రారెడ్డి, పి.రెహమాన్ ఖాన్, సుండుపల్లె జెడ్పీటీసీ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏడబ్ల్యూడీతోనే సమర్థవంతమైన వరిసాగు



రైతులకు పీవీసీ పైపులను అందజేస్తున్న అడిషనల్ డీపీఎం వసంతకుమారి

ఒంటిమిట్ట : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరిసాగు చేపట్టడంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం వసంతకుమారి అన్నారు. సోమవారం ఒంటిమిట్టలోని స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆమె రైతులకు ఏడబ్ల్యూడీ పద్ధతిలో వరిసాగు ఎలా చేయాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిసాగుచేసే రైతులు పాత పద్ధతిలో కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏడబ్ల్యూడీ ద్వారా వరి పంటను తడి లేదా పొడి పద్ధతుల ద్వారా సాగు చేస్తే ముప్పై శాతం నీటిని ఆదా చేయవచ్చని తెలిపారు. ఏడబ్ల్యూడీ పద్ధతి ద్వారా వరిసాగు చేసే రైతులకు పీవీసీ పైపులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమలో ఏపీపీఎం, ఏఓ, ఎంటీ, ఎన్ఎఫ్ఏ రైతులు పాల్గొన్నారు.

రండి.. టీ తాగుతూ చర్చించుకుందాం

రాయచోటి టౌన్ : రండి టీ తగుతూ చర్చించుకుందాం అంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ అధికారులతో చర్చ నిర్వహించారు. సోమవారం సాయంత్రం విరామ సమయంలో ఆయన ఆ సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా, వినూత్నంగా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా విధులు నిర్వర్తిస్తూనే మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

నిధులు.. బురదపాలు

- అండర్ బ్రిడ్జితో అవస్థల పాలవుతున్న ప్రజలు
- నీరు నిలుస్తుండటంతో తప్పని తిప్పలు
- రూ. 12 కోట్ల ప్రజాధనం వృథాగా పోతున్న వైనం



బురదమయమైన రైల్వే అండర్ బ్రిడ్జి



బురదతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పుల్లంపేట : మండలంలోని అప్పారాజుపేట వద్ద రైల్వే అధికారులు రూ.12 కోట్లతో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే ఈ రహదారి గుండా అప్పారాజుపేట, పెరియవరం, హరిజనవాడ. అరుంధతివాడ, రంగంపల్లి వడ్డిపల్లి, చాపల హరిజనవాడ రాచపల్లి, ఆర్.వడ్డిపల్లి తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది పాదచారులు, విద్యార్థులు, వాహనదారులు ప్రయాణిస్తుంటారు. అయితే వర్షం కురిసినప్పుడు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జిలోకి వర్షపునీరు చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అండర్ బ్రిడ్జిలో నీరు చేరడం వలన వృద్ధులు, దివ్యాంగులు ఈ మార్గం గుండా నడిచి వెళ్లాలంటే తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న గేటు ద్వారా వృద్ధులకు ఎంతో మేలు జరిగేది. అయితే ఆ గేటు మూసివేయడంతో ప్రజలు ఈ అండర్ బ్రిడ్జి గుండా వెళ్లాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిలో వర్షపునీరు చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే అవస్థలే



కొద్దిపాటి వర్షానికే ఈ అండర్ బ్రిడ్జి బురదమయం కావడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. గతంలో ఉన్న గేటు మేలు అని అనిపించేది. వెంటనే అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిలోకి వర్షపునీరు చేరకుండా చూడాలి. లేకుంటే ప్రజలు, వాహనదారులకు అవస్థలు తప్పవు.

– ముస్తాక్, ఉప సర్పంచ్, అప్పారాజుపేట

నానా ఇబ్బందులు పడుతున్నాం



అప్పారాజుపేట గ్రామ ప్రజలు రైల్వే రోడ్డు దాటాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్డు దాటాలంటే బురదలో వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలి.

– నూర్ మహమ్మద్, అప్పారాజుపేట